ఓ ముగ్గురి కథ

ఉషారాణి భాటియా



స్త్రేనాంపేట చివర్న మలుపులో చిన్న గుడిసె అది. బైట అయిదారుగురు పిల్లలు బిళ్లలాటలో పోటీ పడుతున్నారు. ఆ పక్క ఓరగా వాల్చివున్న కుక్కి మంచంమీద ఓ వయసుమళ్లినతను పడుకుని ఉన్నాడు. నడినెత్తిమీద సూర్యుడు చుర్రున మండుతుంటే, అతను గురక పెడుతున్నాడు. అతను జబ్బువాడేం కాదు. కానీ బొమికలు పైకిలేచి, నిస్త్రాణగా వున్నాడు. కాళ్ళు ముడుచుకుని వున్నాయి. పైన ఈగలు వాలుతున్నాయి. పక్కనుంచి రంయ్‌మని వెళుతున్న లారీల చప్పుళ్లు, గుడిసె లోపల అరుపులు—అతనికేం పట్టినట్లు లేవు.

ఇంతలో ఓ సైకిలొచ్చి గుడిసెముందు

ఆగింది. దానిమీంచి ఖాకీదుస్తులేసుకున్న ఓ మనిషి దిగాడు. ఒంగి లోపలికి వెళ్ళాడు. లోపల పెద్దఅరుపులు చప్పున ఆగిపోయాయి. బైట ఆడుకుంటున్న పిల్లలు తుపాకీ గుండు పేలినట్లు చెల్లా చెదరయి పోయారు. ఆ ఖాకీ దుస్తు అతనితో ఒక నల్లటి పొడుగాటి యువ కుడు బైటికి వచ్చాడు. ఇద్దరూ గుడిసె పక్కన చెట్టువైపు నడిచారు. కింద గడ్డిమీద కూర్చున్నారు. ఖాకీబట్టలతను రెండు బీడీలు తీసి, ఒకటి ఆ యువకుడి కిచ్చి, రెండోది అంటించాడు.

"రెండు రోజులనుంచీ ఇంట్లో ఒకటే తగూలు. అసలే కూడులేదేమో, నాకు వెర్రెత్తినట్లు వుంది" నల్లటతను తల వంచుకు గడ్డి పీకుతున్నాడు. ఖాకీబట్ట లతను చెట్టుకు ఆనుకుని కాళ్ళుజాపాడు.

"ఆ ముసలమ్మకి చెప్పవయ్యా! రోజూ కాళ్ళు అరిగిపోయేట్లు తిరుగుతున్నాను. పని దొరకటం అంటే మాటలా? కోడం బాకంలో అదేదో థియేటరు కడుతున్నా రట. అక్కడ మేస్త్రీగాడికి రోజూ టీ, బన్ను యిప్పించి బ్రతిమాలుతున్నాను. ఏదీ "ఊ" అంటేనేగా ఇప్పటివరకూ?"

"నాకన్నీ తెలుసు. నిన్నేం అంటంలే. ఇదంతా నా ఖర్మ! ఎనిమిదివరకూ చదివాను. ఏం లాభం? పొట్టపొడిస్తే అక్షరం రానివాళ్ళు ఎంచక్కా కూలి చేసుకు బతుకుతున్నారు. నా ఇంట్లో నిప్పు రాజేసేందుకు కట్టెలు కూడా లేవు."

నల్లటతని కళ్ళుఎర్రబడ్డాయి. గొంతు జీరబోయింది.

"ఆ! అట్లాగన్నావ్ బాగుంది. అంతా మన తలరాతే అనుకో. ఆ మేస్త్రీగాడు ప్రసన్నుడయితే, ఓ ఏడాదిపాటు ఇహ నీకు కష్టంలేదనుకో. కానీ వెధవనన్యాసి ఒకడే ఆశ........."

"పోనీ ఏదో ప్రయత్నిస్తున్నావుగా. అంతేచాలు. ఇదిగో ఇది పట్టుకెళ్ళు."

నల్లటతను చిరుగు చొక్కాలోంచి ఓ అర్థరూపాయ బిళ్ళతీసి అతని చేతిలో పెట్టాడు.

పోయిన బలమేదో తిరిగి వచ్చినట్లు ఖాకీ బట్టలతను, ఆ కాసు చేతిలోకి తీసు కుని, దిగ్గున లేచాడు.

"వస్తా. దిగులుపడక." అంటూ పెద్ద అంగలతో సైకిలుని సమీపించాడు. అత నలా దూరమయేంతవరకూ చూసి, నల్ల టతను, గుడిసెలోపలికి వెళ్ళాడు.

లోపల మళ్ళీ గొంతులు పెద్దగా విన పడుతున్నాయి. ఒక ఆడది వుండి వుండి ఏడుస్తోంది. బైట దూరంగా నిలబడ్డ పిల్లలు ఒక్కొక్కరే లోపలికెళ్ళారు. నులకమంచంమీద పడుకునివున్న ముస లాడు లేచి కూర్చున్నాడు.

"ఏరా మంగా! ఏందొరకలా? నేను బతికుండగా నీకు పని దొరకదులేరా!" అంటూ మళ్ళీ ముడుచుకుని పడు కున్నాడు.

* * *



శీను కిటికీలోంచి ధ్యానతో బైటికి చూస్తున్నాడు. కిటికీవూచలని పట్టుకున్న అతని చేతులు మెల్లిగా కిందికి జారాయి. తల విదిలిస్తూ వెళ్ళి పడక కుర్చీలో వాలాడు. ముఖంమీదికి తువ్వాలు లాక్కుని కళ్ళు మూసుకున్నాడు. ఆ కిటికీ ముందుగా ఎందరో వెళ్ళారు. ఎన్నో సైకిలు బెల్లులు మ్రోగాయి. కానీ అతనికి కావలసిన ఖాకీ బట్టలతను వెళ్ళిపోయి చాలా సేపయింది. అయిదు నిముషాలు గడిచాయి. ముఖంమీద తువ్వాలు తీసి శీను లేచి నిలబడ్డాడు. అలమారులోంచి ఓ పుస్తకం తీసి చేతితో పట్టుకున్నాడు.

"అదేమిట్రా ఫాను వేసుకోలేదేం?" అతని తల్లి లోపలికి వచ్చింది. ఆవిడకి శీను ఒక్కగానొక్క కొడుకు. ఎంచక్కా కొడుకుని ఎం ఏ. చదివించింది. అతను పరీక్ష మొదటి తరగతిలో ఉత్తీర్ణుడయితే, తన కొడుకు కలెక్టరయినంత సంబరపడింది. కానీ అతను కలెక్టరు కాలేదు. కనీసం కలెక్టరాఫీసు గుమ్మం కూడా ఎక్కలేదు. రెండేళ్ళు ఎండనక, వాననక ఎంప్లాయిమెంటు ఆఫీసుముందు క్యూలో ఓపిగ్గా నిలబడ్డాడు. ఆ ఊరంతా తాపీగా తిరిగాడు. ఆఫీసు కార్యాలయాల ముంగిళ్లు, లోగిళ్లు ఎలా వుంటాయో చూశాడు. అధికారంలో వున్నవారి వరిచయభాగ్యం కలిగించుకున్నాడు. కాళ్లు నొప్పెట్టి అరుగుతున్నకొద్దీ, కళ్ళు

పొరలు విప్పి దారి స్పష్టమయిన కొద్దీ మెదడుకి దెబ్బలు తగిలి మొద్దుబారిన కొద్దీ—అతని కోరికలు చిన్నవయి పోయాయి. అవసరాలు పరిమిత మయాయి. ఆయాసంతో నడక మంద గించింది. ఒంట్లో చురుకుదనం పాలు తగ్గింది. పౌరుషం పారిపోయి దాక్కుంది. చివరికి ఒక లోయర్ డివిజన్ క్లార్కు వుద్యోగంలో ఆత్రంగా జొరబడ్డాడు.

గులాబీ రంగు, నీలం రంగు ఫైల్సు కుప్పలు కుప్పలుగా చదివాడు శీను. తను కాలేజీలో నేర్చుకున్న చదువు, అవతల నెట్టి, తతిమ్మా గుమాస్తాల దగ్గిరనుంచి చదవటం, రాయటం ఏమిటో నేర్చు కున్నాడు. తనకంటే తక్కువ తెలివి తేటలున్న వాళ్ళు, తన తలపైకి ఎక్కి, అధికారం చెలాయిస్తుంటే, వేదాంతిలా చూడటం నేర్చుకున్నాడు. తన తరువాత ఆఫీసులో చేరినవాళ్ళు క్యూలో ముందుకి వెళ్ళిపోయి, ప్రొమోషన్లు పొందుతుంటే, చిరునవ్వు నవ్వుతూ వాళ్లని అభినందించ టం అలవరచుకున్నాడు. తన ఆఫీసే ఒక మందిరంలా, తనకిదొరికిన ఆ కుర్చీయే, దేవుడు కటాక్షించిన వరంలా, తన జీవితధ్యేయమే ఆ ఫైళ్ళమధ్యవున్నట్లు చాలా రాజీపడ్డాడు.

ఇంత విజయం సాధించేందుకు అతనికేం సులువు కాలేదు. మొదట్లో చాలా తిరుగుబాటు జరిగింది.

"ఆ గాడిదల కింద పనిచెయ్యను," అని తండ్రిముందు గోలపెట్టాడు.

"నా కింత చదువెందుకు చెప్పారు? ఇంతకంటే ఓ టీకొట్టు పెట్టుకుని బ్రత కటమే గౌరవం" అంటూ తల్లిముందు మొత్తుకున్నాడు.

"ఓ అంటే ఢం రాని అనాగరికుడి కింద దాస్యంచేయడం తల తిక్కరేగు కొస్తోంది. చూస్తో వుండండి! ఎప్పుడో వాణ్ణి చాచి లెంపకాయకొట్టి, రాజీనామా యిచ్చేస్తాను" అని స్నేహితులముందు జబ్బలు చరిచాడు.

కానీ అతనవేం చేయలేదు. అతన్ని ప్రోత్సహించినవాళ్లూ లేరు. కాలమే అతని కన్నీళ్ళు తుడిచింది. ప్రతాపాలని అణిచింది. జీవితంపట్ల ఒకవిధమైన నిర్లిప్తత బోధపరిచింది. ఒక్కో సంవ త్సరం గడుస్తున్నకొద్దీ, అతను మంచి వేదాంతి అయాడు. దాన్నే ప్రపంచం "బ్రతకనేర్చటం", "లౌకికజ్ఞానం" అన్నది.

మనసుకి కాషాయరంగు పట్టించు కున్నా శీను అప్పుడప్పుడూ మామూలు మనిషి అయేవాడు. అక్కడా ఇక్కడా దరఖాస్తులు వేసేవాడు. చక్కగా ముస్తాబయి ఇంటర్వ్యూకి వెళ్లేవాడు. తనకంటె తక్కువ అర్హతలున్న అభ్య ర్థుల్నిచూసి, కొండంత ఆత్మవిశ్వా సంతో ఇంటికి వచ్చేవాడు. ఆ తరువాత రోజూ విడవకుండా పోస్టుమాన్ కోసరం చూసేవాడు. ఆ సమయమేదో



దాటిపోయి, సైకిలు బెల్లు మోత ఇల్లు దాటిపోయాక, తువ్వాలు ముఖంమీద వేసుకుని కూర్చునేవాడు. ఈ రోజూ ఇంతే అయింది.

తల్లి ఫానువేసి, అతని భుజం తట్టి వూపింది. "ఎందుకురా ! అంత దిగులు పడిపోతావు. ఇప్పుడు చేతిలో ఓ వుద్యోగం వుందిగా. అదృష్టం కలిసిరావాలి."

అతను తల్లివంక పరధ్యాన్నంగా చూసి కళ్లు పుస్తకంవైపు మరల్చాడు.

ఆమె లోపలికి వెళ్లి భర్తతో అంటూంది.

"వాడి దురదృష్టం కాకుంటే ఆ సుందరమ్మ కొడుకు బి. ఏ. కూడా పూర్తిచేయలేదు. అదేదో కంపెనీలో మేనేజరుట. నా తోడికోడలు తమ్ముడు స్కూలుఫైనలు పాసయాడా ? ఆఫీసరయాడటండీ ?"

శీను పుస్తకం అవతల పారేసి

తువ్వాలు మళ్ళీ ముఖంమీదికి లాక్కు న్నాడు.

"అదిసరేగానీ, ఆ బెజవాడ సంబంధంవాళ్ళు మళ్ళీ కబురుపంపారు. ఏం జవాబివ్వను? వీడా ఏకు మేకై కూర్చున్నాడు," అంటున్నాడు తండ్రి.

"వాణ్ణి ఒప్పించే బాధ్యత నాది. మీరు వుత్తరం రాసేయండి. ఇది బాగుంది! గుమాస్తానంటూ ఏది మానుకుంటాడు? పెళ్ళా? పిల్లలా? అచ్చటా, ముచ్చటానా? ఏది?"

* * *

"ఏమండీ! వాడు రోజూ నాతో గోలపెడుతున్నాడు. మీరేమీ పట్టించు కోవటంలేదు."

"చూడు రత్నం! వాణ్ణి సగం నువ్వే పాడుచేస్తున్నావు. అసలు విషయం ఏమిటి? ఆఫీసులో ఎవరితో నైనా దెబ్బలాడాడా?"

"ఆ గొడవలన్నీ నాకు తెలియవు. మీరే పిలిచి అడగండి." అంటూ తల్లి కొడుకుని కేకవేసింది.

ఖాకీరంగు చారలలాగూ, జుబ్బా, చెరిగిన క్రాపు, చేతిలో పెర్రీమాసను పుస్తకం, పాతికేళ్ళ శేఖర్ తండ్రి ముందుకొచ్చి నిలబడ్డాడు.

"ఆ! ఏమయింది? నువ్విప్పుడు బొంబాయి ప్రయాణం దేనికి? పిలుపు వచ్చిందా?"

"వచ్చింది డాడీ."

శేఖర్ నేలచూపులు చూస్తున్నాడు.

"అక్కడ వుద్యోగం దొరకటం ఎంత కష్టమో తెలుసా?"

"తెలుసునండీ. కానీ నాకిక్కడ జాబ్ సాటిస్‌ఫాక్షను లేదు."

"అంటే?"

"పని రొటీన్‌గా వుంది. పైకిపోయేం దుకు ఛాన్సులు లేవు."

"నాకు తెలీక అడుగుతాను! ఏం? నీ వయసుకి నెలకి ఆరువందల జీతం చేదా? ఈ మాత్రం కూడా లేక..."

"అదికాదండీ నాన్నగారూ! బొంబే అయితే కారు అలవెన్సు అదీ వుంటుంది. విదేశం వెళ్ళే అవకాశం వస్తుంది. ఆ సొసైటీ వేరు. ఆ లైఫ్ వేరు."

ఇంతలో గుమ్మందగ్గిర నిలుచున్న తల్లి ముందుకి వచ్చింది కొంగు సరిజేసు కుంటూ. వచ్చి భర్తపక్కన కూర్చుంది.

"ఆ సేట్ చునీలాల్ మీకు తెలుసుగా? ఒకమాటు అబ్బాయిని తీసుకెళ్లి చూస్తే ఏంపోయింది?"

భర్త ఆమెవంక చిరాగ్గా చూశాడు. ఈ లోపల శేఖర్ లోపలికి జారు కున్నాడు. "ఇదిగో! నీ మాటలు ఎలా వుంటాయంటే..."

"నా మాటలకేంగానీ పాపం! వాడి ముఖం చూడండి. కుర్రవాడికెన్నో ఆశలుంటాయి. సరదాలు కలుగుతాయి. ఈ వయసులోకాకపోతే

యువ

మరెప్పుడు ఇవి తీరటం? చిన్నవెధవ! లోలోపల కుమిలిపోతున్నాడు. మనం మటుకు చూస్తూ పూరుకోగలమా? ఏదైనా చెయ్యాల్సిందే. అసలు వాడి జాతకంలోనే వుందిట. శాస్త్రిలుగారన్నారు. పెద్ద హోదా".

"నీ మాటే నీకు. ఇంకా సంవత్సరమైనా కాలేదు వాళ్ళ కాళ్లూ వీళ్ళ చేతులూ వట్టుకుని ఈ వుద్యోగం సంపాదించాను. కాస్త ఇందులో కుదురుగా పనిచేస్తే తరువాత ఏమైనా చూడవచ్చు. ఏ కారణంచెప్పి మళ్ళీ సహాయం అడగను?"

"ఆ! పోనిద్దురూ! ఇచ్చేవాళ్ళుండాలేగానీ కారణాలెందుకు?"

* * *

కాలం గిర్రున తిరుగుతోంది.

ఓ రోజు దినపత్రికలో వార్త:

"మోగాలో వీధి వూడ్చేవాని వుద్యోగానికి గ్రాడ్యుయేటు దరఖాస్తు."

ఇంకోరోజు మరో పత్రికలో తాజా వార్త:

"సైంటిస్టు షా ఆత్మహత్య. ప్రభుత్వ పరిశీలన."

మరో పత్రిక మరోరోజు అందికదా:

"రాజధానిలో బస్సు కండక్టర్ల వుద్యోగానికి నూటయాభై మంది గ్రాడ్యుయేట్ల దరఖాస్తులు."

ప్రజలు ఆ వార్తలు శ్రద్ధతో చదువుతున్నారు. ఒకరితో ఒకరు చర్చించుకుంటున్నారు. ఆలోచిస్తున్నారు. కానీ క్రమేణా వారి ఆశ్చర్యం అలవాటుగా మారిపోయింది. ఆ వార్తలు వారి జీవితంలో ఒక భాగమయిపోయాయి. వారిలో పత్రికలు చదివేవారి సంఖ్య ఎక్కువయింది. మాట్లాడేశక్తి అధిగమించింది. చర్చలూ, సమావేశాలూ పెరిగిపోయాయి. కానీ ఆలోచనలే కరువయిపోయాయి. సొంత ఆలోచనలే అసలు ఎరగరు వాళ్ళు. మెల్లిగా వారిలో కొందరు మంగాలులయారు. చాలామందే శీనులయారు కొందరు శేఖరులయారు.

ఇంతకీ మంగాలు ఏమయినట్లు?

అతని తండ్రి ఓ రోజు ఆ కుక్కి మంచంమీదే కన్నుమూశాడు. కోడంబాకంలో థియేటరు కట్టారుగానీ మంగాలుకి పని తగలలేదు. ఆ ఖాకీబట్టలతను మటుకు ఇప్పుడు మంగాలు కోసరం రావటంలేదు.

శీనుకి పెళ్ళయిందా?

అయింది. నలుగురు పిల్లల తండ్రి కూడా అయాడు. ప్రమోషనుకోసరం (యు.డి.సి.గా) ఎదురు చూస్తున్నాడు.

శేఖరం బొంబాయి వెళ్ళాడా?

వెళ్ళాడు. కారు దొరికింది. విదేశం కూడా వెళ్లివచ్చాడు. అతనికి జాతకం చెప్పిన శాస్త్రిలుగారికి పట్టువంచె, తాంబూలం యిచ్చింది తల్లి.